## వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్/హెచ్ఐ) కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 10వ తేదీ నుంచి, బీఏఎస్ఎల్‌పీ (సీబీసీఎస్) రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ (ఓడీఎల్) నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు మూడేళ్ల ఫార్మ్‌డీ, ఆరేళ్ల ఫార్మ్‌డీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

### వాయిదా పడిన పరీక్ష తేదీల ఖరారు

ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈనెల 2వ తేదీన నిర్వహించాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను నిర్ణయించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షను ఈనెల 9న, అన్ని లా కోర్సుల పరీక్షలను ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రం, పరీక్ష సమయంలలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### 8న టీజీ సీపీజీఈటీ మొదటి దశ సీట్ల కేటాయింపు జాబితా విడుదల

రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ సీపీజీఈటీ – 2024 మొదటి దశ సీట్ల కేటాయింపు జాబితాను ఈనెల 8న విడుదల చేయనున్నట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. రెండో దశ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ఇతర వివరాలకు తమ వెబ్‌సైట్‌ను క్రమం తప్పక చూడాలని సూచించారు.

# నోటీసులు ఉపసంహరించుకోవాలి

- ఏండ్లుగా పేదలు స్థిరనివాసాలు ఏర్పర్చుకున్నారు
- క్రమబద్ధీకరణలో పట్టాలు సైతం ఇచ్చారు
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 4: కూకట్‌పల్లి నియోజకవర్గంలో పేదల ఇండ్లకు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్‌ను ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు కలిశారు. ఈ సందర్భంగా పలు సమసలపై వినతిపత్రాలు అందించారు. 40 ఏండ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూముల్లో కాలనీలు, బస్తీలు వెలిశాయని, పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇండ్లు నిర్మించుకొని జీవిస్తున్నారని తెలిపారు. అల్లాపూర్ డివిజన్‌లోని సున్నం చెరువు వద్ద పద్మావతినగర్‌లో 40 ఏండ్లుగా ప్రజలు జీవిస్తున్నారని, ఆ కాలనీలో మౌలిక వసతులు కల్పించారన్నారు. అలాగే బోయిన్ చెరువు సమీపంలోని ఎస్సీకాలనీలో 70 ఏండ్లుగా ప్రజలు నివాసం ఉంటున్నారని, కాలనీలు, బస్తీల్లో అనేక ఇండ్లకు రిజిస్ట్రేషన్లు జరిగాయని, ప్రభుత్వం ద్వారా క్రమబద్ధీకరణలో పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఇండ్లు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని రెవెన్యూ నోటీసులు జారీ చేస్తూ ఖాళీ చేయాలని, లేదంటే కూల్చివేస్తామని హెచ్చరికలు చేస్తుండటంతో ప్రజంతా భయాందోళలనలకు గురవుతున్నారన్నారు. పురాతమైన ఆలయాలు, శ్మశానాలకు నోటీసులు జారీ చేయడం గమనార్హమని అన్నారు. ఎన్నో ఎండ్లుగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలను ఇబ్బంది పెట్టొద్దని, నోటీసులను ఉపసంహరించుకోవాలని కోరారు. కేపీహెచ్‌బీకాలనీ 3వ ఫేజ్ రమ్యాగ్రౌండ్‌లోని 2 ఏకరాల 13 గుంటల స్థలం లేఅవుట్ ప్రకారం ప్రభుత్వ పాఠశాల కోసం కేటాయించారని, నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. మరిని ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు స్థలాలు కేటాయించారని ఆయా ప్రాంతాల వివరాలను కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్‌రెడ్డి, ముద్దం నర్సింహాయాదవ్, సబీహాబేగం, పండాల సతీశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

## నేత్రదానం అన్నింటి కన్నా గొప్పది




మాదాపూర్, సెప్టెంబర్ 4: నేత్రదానం అన్నింటికన్నా గొప్పదని, మన శరీరంలో ప్రధానమైన వాటిలో కండ్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ప్రపంచ కంటి దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హైదర్‌నగర్ డివిజన్ పీఎన్‌ఆర్ ఎంపైర్ బిల్డింగ్‌లోని వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## బోయిన్‌చెరువు కొలనులో నిమజ్జన ఏర్పాట్లు

బాలానగర్, సెప్టెంబర్ 3: ఓల్డ్‌బోయిన్‌పల్లి పరిధి హస్మత్‌పేట బోయిన్‌చెరువు కొలనులో వినాయక నిమజ్జన పనులు ముమ్మరంగా జరుగతున్నాయి. బుధవారం కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య నేతృత్వంలో నాలుగు దిక్కుల్లో ఏర్పాటు చేసిన గ్రిల్స్‌కు రంగులు అద్దారు. చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. చెరువు పరిసరాల్లో ఇప్పటికే విద్యుత్ లైట్ల ఏర్పాటు పూర్తయ్యాయి. డీఈ బాలకృష్ణ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేశ్, బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ నాగమణి, టీపీఎస్ సోమేశ్, ఏఈ రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతిలేకుండానే.. ఆరంతస్తులు!

### చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు



దుండిగల్, సెప్టెంబర్ 4: అధికారుల అండదండలు ఉంటే ఎక్కడైనా ఆకాశ హార్మ్యాలు నిర్మిస్తామంటున్నారు అక్రమార్కులు. అది ప్రభుత్వ స్థలమా, నిషేధిత స్థలమా, మరేదైనా సరే ఆకాశంలోనైనా నిర్మాణాలు చేపడతామని నిరూపిస్తున్నారు. ఇందుకు నిదర్శనం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీ పోచంపల్లిలోని నిర్మాణమే నిలువెత్తు సాక్ష్యం. ఇటువంటి నిర్మాణాలకు కొదువే లేదు అనే చందంగా మారింది పరిస్థితి. గండిమైసమ్మ–దుండిగల్ మండలం, డీ పోచంపల్లిలోని సర్వేనంబర్ 168లో సుమారు 30–35ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. ప్రస్తుతం ఈ స్థలం ప్రభుత్వ నిషేధిత స్థలాల జాబితాలోనే ఉంది. అయితే అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధనలున్నాయి. గతంలో 2018కి ముందు డి.పోచంపల్లి గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో పలువురికి ఇంటి నంబర్లు జారీ చేసింది. దీనిని అడ్డుపెట్టుకున్న కొందరు బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే మెజార్టీ స్థలంలో నిర్మాణాలు వెలిశాయి. తాజాగా గండిమైసమ్మ చౌరస్తా నుంచి దుండిగల్ ఔటర్ రింగ్‌రోడ్డు వైపు వెళ్లేదారిలో, ఎస్‌బీఐ బ్యాంకు వెనుకాల ఓ వ్యక్తి కేవలం 120 గజాల స్థలంలోనే ఆరు అంతస్తుల భవనం నిర్మిస్తున్నాడు. ఈ నిర్మాణంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల అండదండలు, సహకారం లేకపోతే అంతటి నిర్మాణం ఎలా సాధ్యం అవుతుందని కొందరు బాహటంగానే ప్రశ్నిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా ఎవరి సహకారంతో నిర్మిస్తున్నారని ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఇదే విషయమై దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరావును వివరణ కోరగా సదరునిర్మాణం విషయం తనదృష్టికి రాలేదని పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీకుంటామని ముక్తసరిగా సమాధానమివ్వడం గమనార్హం.

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

### శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మాదాపూర్, సెప్టెంబర్ 4: వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను తక్షణమే పునరుద్ధరించి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్ డివిజన్ల పరిధిలోని పలు సమస్యలతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివేకనందానగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలే పరిష్కార ధ్యేయంగా కృషి చేయాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చి ప్యాచ్ వర్క్‌లు మొదలుపెట్టాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రోడ్ల సమస్యను ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకొని త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మాన్‌సూన్ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలన్నారు. అవసరమున్న చోట యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు రాజు, డీఈ స్రవంతి, దుర్గాప్రసాద్ ఉన్నారు.










## నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



చెరబండరాజునగర్‌లో పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాలానగర్, సెప్టెంబర్ 4: ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం బాలానగర్ చెరబండరాజునగర్‌లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని ఎంతో కృషి చేసిందన్నారు. అందులో భాగంగానే బాలానగర్ చెరబండరాజునగర్‌లో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న పాఠశాలలో సకల సౌకర్యాలుంటాయని తెలిపారు. విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు.

## విలువలతో కూడిన విద్యను అందించాలి



శేరిలింగంపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రతినిధులు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 4: విలువలతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉందని తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు శ్యామలరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో శేరిలింగంపల్లి ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాల, కళాశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతను ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రత్నప్రభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం



గురు గోవింద్‌నగర్ కాలనీలో ముంపు సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్


కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 4: ఎల్లమ్మ బండ, గురు గోవింద్‌నగర్‌కాలనీలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కృషి చేస్తానని కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆల్విన్‌కాలని డివిజన్ ఎల్లమ్మ బండ గురుగోవింద్‌సింగ్ కాలనీలో వరద ముంపు సమస్యలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతంలో నిలిచిన నీటిని జేసీబీ సహాయంతో తొలగించేలా చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు సీహెచ్ భాస్కర్, శ్రీనివాస్, సంగమేశ్, రాజుగౌడ్, ఇంతియాజ్, ప్రభాకర్, వర్క్ఇన్స్పెక్టర్ రవి ఉన్నారు.

## జేఈ వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోండి



ఎంఎన్‌రెడ్డినగర్ వెల్ఫేర్ అసోషియేషన్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరం

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 4: తొమ్మిది నెలల నుంచి 15 ఏండ్ల ఏండ్లలోపు చిన్నారులకు మెదడువాపు నివారణ ఉచిత జేఈ వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకునేలా బుధవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎంఎన్‌రెడ్డినగర్ ఫేస్–1లో ఉన్న బస్తీ దవాఖానాలో ప్రారంభించారు. వైద్యురాలు కిరణ్మయితో పాటు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూదుల సంపత్‌గౌడ్ ఆశవర్కర్లు ఉన్నారు.



ఇటీవల బాలానగర్‌లో హత్యకు గురైన ముకేందర్, సావిత్రి కుటుంభాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. బుధవారం బాలానగర్ దామోదరం సంజీవయ్యకాలనీలో స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ నాయకుడు ఏరుపుల రాజమల్లయ్య నివాసానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకమని పేర్కొన్నారు.

– బాలానగర్



మాదాపూర్, సెప్టెంబర్ 4: వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ కాలనీ బస్తీ దవాఖానను బుధవారం స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. వర్షాలు అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# మట్టి ప్రతిమలతోనే పర్యావరణ రక్ష



సమావేశంలో పాల్గొన్న మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ సౌజన్య, డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్ తదితరులు

దుండిగల్, సెప్టెంబర్ 4: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 7 నుంచి జరుగనున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందామని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్‌ఎంసీ) మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి అన్నారు. మేయర్ అధ్యక్షతన ప్రగతినగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, కమిషనర్ సౌజన్య, ప్రజా ప్రతినిధులు, అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. మట్టి ప్రతిమలనే పూజిస్తే భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించగలుగుతామని పిలుపునిచ్చారు. వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అధికారులు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో కార్పొరేషన్ డివిజన్ల పరిధిలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద భద్రతతో పాటు ఎప్పటికప్పుడు పోలీసుల పర్యవేక్షణ, అదేవిధంగా నిమజ్జన సమయంలో చెరువుల వద్ద క్రేన్ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు, భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు, తాగునీరు, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, చెరువుల్లో ఎప్పటికప్పుడు విగ్రహ వ్యర్థాల తొలగింపు చర్యలు వంటి అంశాలపై చర్చించారు. ఎన్‌ఎంసీ అధికారులు, సిబ్బంది అనుసరించే విధి విధానాలపై తగు సూచనలు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. అందుకు ఆయా గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నేతలు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, విభాగాల అధికారులు, సివిల్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ కోసం

మాదాపూర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒకరూ మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజించాలని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని బుధవారం మియాపూర్‌లోని క్యాస్టిల్ టౌన్ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మహేందర్, లక్ష్మణ్, సురేశ్‌లతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, సరస్వతి ఉన్నారు.



పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకులను పంపిణీ చేసిన హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్

## నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 4: వినాయక నిమజ్జనంలో ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం డివిజన్‌లో వినాయన నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా చెట్ల కొమ్మల తొలగింపు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వినాయక నిమజ్జన ఘట్టంలో భాగమైన శోభాయాత్రలో కాలనీలు, బస్తీల్లో భారీ విగ్రహాలతో ఊరేగింపు వేడుకులు ఉంటాయన్నారు. రోడ్డుకు ఇరువైపుల చెట్ల కొమ్మలను తొలగింపు, విద్యుత్ తీగలు తగలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లను బాగుచేయాలని, గుంతలను పూడ్చాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్, ఎలక్ట్రికల్ సిబ్బంది ఉన్నారు.



హైదర్‌నగర్ డివిజన్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

## వరద ప్రభావిత ప్రాంతాల్లో కౌన్సిలర్ పర్యటన



మల్లంపేట్ కేవీఆర్ వ్యాలీలో రోడ్డుపై వరద నీటిని తొలగించేందుకు జేసీబీతో కందకం తవ్విస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, సెప్టెంబర్ 4: నివాసప్రాంతాల మధ్యన, రోడ్లమీద వరద నీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, 26వ వార్డు, మల్లంపేట్ కేవీఆర్ వ్యాలీలోని వరద ప్రభావిత ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వరద నీటిని బయటకు పంపేందుకు జేసీబీ సహాయంతో కందకం తవ్వించారు. కృష్ణ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసినపుడు ముంపు సమస్య తలెత్తకుండా ఇప్పటికే పలు ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. పలు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

## అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 4: అక్రమనిర్మాణంపై చర్యలు తీసుకోవాలని గాజులరామారం డివిజన్ ఉమాదేవినగర్ వాసులు కోరుతున్నారు. జగద్గిరిగుట్ట శ్రీనివాసనగర్ నుంచి ఉషాముళ్లపూడి వెళ్లేమార్గంలో ఫిరోజ్ చికెషాపు నిర్వాహకుడు రెండంతస్తుల నిర్మాణం చేపట్టాడు. విద్యుత్ స్తంభాలు పక్కకు మార్చి రోడ్డుపై పిల్లర్లు వేశాడు. ఈ విషయంపై బుధవారం కాలనీవాసులు మున్సిపల్, విద్యుత్ డీఈ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రోడ్డుపై వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. పరిశీలన చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమ్మయ్యయాదవ్, రమేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 4: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం 7వ ఫేజ్‌లో అల్లె వెంకటేశ్వర్లు (54) ప్రైవేటు హాస్టల్ నిర్వహిస్తున్నాడు. అతడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపగా ఆపరేషన్ చేశారు. ఫిజియోథెరపీ కోసం అడ్డాగుట్ట న్యూలైఫ్ ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేరాడు. ఈనెల 3న వైద్యశాలలో చికిత్స పొందుతుండగా రాత్రి 11.30 గంటలకు వెంకటేశ్వర్లు మృతి చెందాడు. ఓవర్ డోస్ వల్లే తన తండ్రి మరణించాడాని, డాక్టర్లు నిషాల్, ముహిత్‌లతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కూతురు రేవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**PUBLIC NOTICE**

Public are hereby informed that my client ICICI HFL, having its regional office at Kukatpally, are proposing to consider a finance in file No. 7792049132, to be advance to Sri. K. Srikanth who acquired the same through Regd., Sale deed No. 2376/2024, from Sri. B. Venu Manohar Reddy, who in turn purchased the same from Sri. Ramesh A. Vaswani, rep. by his GPA Holders Sri. B. Ramanjaneyulu & Smt. B. Malleshwari through Vide document No. 2229/2024 with respect all that the Municipal House bearing No. 2-22-311/136A, on Part of Plot No. 136A, admeasuring 200 Sq. Yards., in Sy. No. 181, situated at Addagutta Co-operative Housing Society Ltd., Kukatpally Village & Mandal, Medchal – Malkajgiri District. If any person/s has/have any objection for the loan to be advanced by my client are any matter of claims in the respect of the above said property, the same may be intimated to the undersigned in writing within 10 days from the date of the publication of this notice, failing which my client may consider the loan application in favour of Smt. T. Mamatha & Sri. K. Srikanth any objections there after shall not be entertained and shall be deemed to have been waived.

Sd/- **M/S ARUN AND ASSOCIATES**
ADVOCATES, # Room No. 6, 4th Floor,
Srinath Commercial Complex,
S.D. Road, Patny Center,
Secunderabad – 03
Phone: 8008059359